# ప్రైవేట్ కోచింగ్



**ని**శ్శబ్దంగా ముందు గదిలోనికి ప్రవేశించిన జగపతిమాస్టార్ని చూసి తత్తరపడ్డారు ట్యూషన్ విద్యార్థులు అనూప్, శ్రీమతి మధుమతి.

మధుమతిపచ్చని నడుంమీద వున్న పల్చని మడతల మెత్తదనాన్ని పరీక్షిస్తూన్న అనూప్ తన చేతిని చటుక్కున వెనక్కి లాక్కున్నాడు.

సుతారంగా అతడి వడిలో వుంచిన తన చేతిని షాక్ కొట్టినట్లుగా వెనక్కి లాక్కుంది మధుమతి. విషయం గ్రహించిన మాస్టారు సీరియస్‌గా వారికేసి చూశాడు.

అపరాధ భావంతో వారిద్దరూకళ్లు దించుకున్నారు.

"అనూప్... ఇవాల్టికి నువ్వు వెళ్లు" నెమ్మదిగా అన్నారు మాస్టారు.

అతడు నిశ్శబ్దంగా లేచివెళ్లిపోయాడు తలదించుకునే.

మాస్టారు మధుమతి ముందుకి వచ్చి నిలబడ్డాడు. ఆమె తలదించుకునే వుంది.

"ఏనమ్మాయ్... ఇదేమన్నా బాగుందా? పెళ్లయిన పిల్లవి – నీకిది తగునా?" కృతక గంభీరంగా అన్నాడు.

ఆమె నుండి సమాధానం లేదు. ఆమె చేతి వేళ్లు వడిలో వున్న పుస్తకాల మీద వలయాలు చుడుతున్నాయ్.

"నా ట్యూషన్ క్లాసుల్లో ఇలా జరుగుతూందని ఎవరికైనా తెలిస్తే ఇక నా పరువేం కావాలి?" వలయాలు చుడుతున్న ఆమె చేతిని పట్టుకుని ఆపుతూ అన్నాడు. ఒక నిమిషం నిశ్శబ్దం. వంచిన తలని మెల్లగా పైకెత్తి మాస్టారి ముఖంలోకి కొంచెం బెరుగ్గా, ఇంకొంచెం ఆశ్చర్యంగా చూసింది మధుమతి – తన చేతిని అదిమిన ఆయన చేయి ఎంతకీ విడివడక పోవడంతో. ఆమె కళ్లలోకి చూస్తూ అదో రకంగా నవ్వాడాయన. ఆమెకీ అదే రకం ధైర్యం వచ్చింది.

"ఫర్వాలేదులే – భయపడకు... అనూప్‌తో నీ అఫైర్ నాల్గో కంటి వాడికి తెలియనివ్వను..." రెండో చేత్తో ఆమె భుజంపై తడుతూ అన్నాడు.

ఆయన ఉద్దేశ్యం ఆమె కవగత మయింది. సన్నగా నవ్వింది. తన చేతిని అదిమి వున్న మాస్టారి చేతిపై తన రెండో చెయ్యి వేసింది.

ఆయన వెనుకే ఆయనతో బాటు లోనికి నడిచింది. అలా నికరమైన పరువంలో వున్న మధుమతి మధ్య వయస్కుడైన మాస్టారి పడక గదిలో ఫక్కుమంది.

*　　　*　　　*

బడ బడమంటూ స్కూటర్ ఆగిన శబ్దానికి మధుమతి ఉలిక్కిపడింది. తన స్థితిని అవలోకించుకుంది. చెదిరిన కురులూ – నలిగిన విరులూ – స్థాన భ్రంశం చెందిన బట్టలూ – ముక్కును ముద్దాడుతున్న బొట్టు...

కంగారుగా మాస్టారి ముఖంలోకి చూసి "మా ఆయన వచ్చినట్లున్నారు" అంది.

మాస్టారు ఏమాత్రం తొణక్కుండా "నువ్వు అటాచ్డ్‌లోకి వెళ్లి శుభ్రంగా టాయిలెట్ అయి రా" అంటూ లేచి జుట్టు సర్దుకుంటూ ముందుకి నడిచాడు.

"ఆ! రండి మాస్టారూ రండి" మధుమతి భర్తని లోనికి ఆహ్వానిస్తూ అన్నాడు జగపతి మాస్టారు.

"ఈ రోజుల్లో స్టూడెంట్సెట్లున్నారు చూశారూ..... ఛ...ఛ... వీళ్లెలా తయారయ్యారంటే...క్రమశిక్షణ అనేది లేకుంటే అసలు జాతికి భవిష్యత్తు ఎక్కడ వుంటుందండీ?"

ఆయన చెప్పేదేమిటో, దేని గురించో అర్థం చేసుకోవాలని ప్రయత్నిస్తూ లోపలికి వచ్చాడు మధుమతి భర్త.

"మధుమతి"– తన భార్య అక్కడ కనబడకపోవడంతో సందిగ్ధంగా అడగబోయాడు.

"అదే మాస్టారూ చెప్తున్నది! అసలే గొప్పింటి పిల్లాయె, ఎంతో గౌరవమైన కుటుంబం నుంచి వచ్చిందాయె. పాపం ఎంత నొచ్చుకుందనీ..."

"ఏమిటో మాస్టారూ మీరు చెప్పేది!?" అయోమయంగా, కించిత్తు గాభరాగా అడిగాడు మధుమతి భర్త.

"ఏం లేదు మాస్టారూ. ట్యూషన్‌కి వచ్చిన ఓ అల్లరి స్టూడెంటు అమ్మాయిని-అదే మీ శ్రీమతిని ఏదో గేలి చేశాడట. ఇక చూడండి అభిమానం గల పిల్లేమో అప్పట్నుంచీ కళ్లు వాచిపోయేలా ఏడుస్తూనే వుంది. ఖాళీ నేను లేటుగా ఇప్పుడే వచ్చాను. విషయం తెలిసి, ఆ కుర్రాణ్ణి కేకలేసి పంపేసి, అమ్మాయిని సముదాయించి, మీ ఆయన ఈ స్థితిలో చూస్తే బాధపడతాడు శుభ్రంగా ముఖం కడుక్కుని రమ్మని ఇప్పుడే లోపలికి పంపి ఇలా వస్తున్నాను. మీరూ రానే వచ్చారు" తన భార్య పట్ల ఆయన వాత్సల్యానికి అతడు తన సంతోషాన్ని వ్యక్తపరిచాడు.

అంతలో అక్కడికి వచ్చింది మధుమతి శుభ్రంగా తయారయి. "ఇవి చిన్న చిన్న విషయాలు, ఇలాటివి మనసుకి పట్టించుకోకూడదమ్మాయ్" అనునయంగా అన్నాడు జగపతి మాస్టారు మధుమతిని ఉద్దేశించి. ఆమె భర్త వైపు సాభిప్రాయంగా చూసింది. అవునన్నట్టు తలూపాడు మధుమతి భర్త.

'అమ్మ మాస్టారూ... అనుకుంది అంతవరకూ వాళ్ల సంభాషణ లోపలి నుంచి వింటూ నుస్తాబైన మధుమతి.

వెళ్లడానికి స్కూటరు స్టార్టు చేస్తున్న మధుమతి భర్తతో అన్నాడు మాస్టారు.

"ఇక ఈ కుర్రకారుతో అమ్మాయిని కలపడం నాకిష్టం లేదు గానీ. ఇబ్బందే అయినా ఎలాగో వీలు చేసుకుని ఆమెకి సెపరేట్‌గా ప్రైవేట్ కోచింగ్ ఇద్దామనుకుంటున్నాను."

తన భార్య భద్రత పట్ల ఆయన కున్న శ్రద్ధకి అతడు తన కృతజ్ఞతలు తెలిపాడు– తాను పత్నీవ్రతుడు కాక పోయినా, స్వతహాగా అనుమాన స్వభావి యైన మధుమతి పతి. "ఏమండీ నేను చదువుకుంటానండీ. ఇంట్లో ఏం తోచడం లేదు" అన్న తన ముద్దుల సతి ముచ్చటని తీర్చడానికి ఎంతో మధనపడి, చివరికి కుర్ర ట్యూటర్ల నందర్నీ వదిలి జగపతి మాస్టార్ని ఎంచుకున్నందుకు తనని తానే అభినందించుకున్నాడు.

ఎంతో సిన్సియర్‌గా మరో మారు మాస్టారికి తన కృతజ్ఞతలు తెలిపి, తన భార్యని శ్రద్ధగా కోచ్ చేయమని కోరి బయల్దేరిన మొగుడ్ని, చెయ్యి ఊపుతున్న మాస్టార్ని చూసి స్కూటరు వెనుక సీట్లో నుంచి ముసి ముసిగా నవ్వుతోంది మధుమతి.

—ఉమాధర్

